ఆరు నెలల తర్వాత హఠాత్తుగా రోడ్డుపైన తారసిల్లిన ఆప్తమిత్రుడు అనంతమూర్తి "ఏమిట్రోయ్ ఉమాపతీ! నువ్వు జీవించే వున్నావా?" అని పలకరించాడు.

నేనూ అంతే సీరియస్‌నెస్ ఒలకబోస్తూ "నాకున్నూ సరిగ్గా అలాంటి సందేహమే కలిగిందిరా బాబూ! అయితే నువ్వుగూడా జీవించే వున్నావన్న మాట!" అంటూ బదులిచ్చాను.

నిజానికిదేం తమాషా వ్యవహారంగా తోచడం లేదు. ఈ మధ్య నా మట్టుకు నాకు చావడమే సహజంగానూ, బ్రతికి వుండడమే అత్యాశ్చర్యకరమైన విషయంగానూ తోస్తూవుంది మరి!

అప్పుడు నేనన్నాను- "మునుపటికి నచికేతుడనే మునికుమారుడు యమధర్మరాజా సముఖానికి వెళ్ళి మృత్యు రహస్య మేమిటో సెలవివ్వమని అడిగాడట! ఆ నచికేత యమసంవాదానికి కఠోపనిషత్తని పేరు. నేనెలా జీవించి వున్నాను, నువ్వెలా జీవించి వున్నావు? ఈ ప్రపంచంలో ఇంతమంది వ్యక్తులూ ఎలా జీవించి వుండగలుగుతున్నారన్న కీలకమైన ప్రశ్నకు నేనిటీవల సమాధానం తెలుసుకున్నాను. ఇది సరిక్రొత్త ఉపనిషత్తు."

"బాబ్బాబూ! దాన్ని కాస్త నా కుపదేశించ రాదా?" అన్నాడు అనంతమూర్తి.

"అబ్బో, ఆశ! ఊరికేనా? గురుదక్షిణ యిచ్చుకోవాలి. అల్లదిగో అజంతా..." హోటల్ని చూపెట్టాను.

"పద పద" అన్నాడు అనంతమూర్తి, జేబులో పర్సును తడిమి చూచుకుంటూ!

** ** **

చెట్టు మంచి మామిడి పండు రాలి పడడం చాలా చిన్న సంఘటన. అతి మామూలు విషయం గూడా. కానీ అది భూమ్యాకర్షణ శక్తి అనే గొప్ప సత్యాన్ని తెలుసుకోడానికి దారితీయలేదా? అట్లాగే నాకొచ్చిందిగూడా సాదాసీదా ఉత్తరం. కవరుపైన ఫ్రమ్ అడ్రస్సు గజిబిజిగా వుండిపోయింది. చిరునామాదారుణ్ణి మాత్రం నేనే. చించి చూచాను. "డియర్ ఉమాపతీ! ఎంత కాలమైంది మనం కలిసి! పంట పొలాల్లో, కాలవగట్లల్లో, ఇసుక తిన్నెల పైన..." సినిమాల్లో డ్యుయెట్ల సన్నివేశాలన్నీ మనసులో నిలిచి నాకెందుకో ఒళ్లు కంపించి పోయింది. ఎవరైనా నన్ను ఫూల్ చేయాలనుకుంటే తప్ప నాకిలా లవ్ లెటర్స్ రాయగలిగినవాళ్లెవరూ లేరు. అది లెటర్ పాడ్‌లో నుంచి చించిన కాగితం కాదు. అప్పటికప్పుడు దొరికిన ఏదో కాగితంపైన




# కఠోరసత్యం

మధురాంతకం రాజారాం

తొందర తొందరగా గిలికినట్లున్న అక్షర పంక్తులు. నిశిత పరీక్షకు గురిచేసి సంతకాన్ని పరిశీలించాను. ఆ పేరులో రెండు పదాలున్నాయి. రెండూ 'యస్' తోనే ప్రారంభమవుతున్నాయి. ఈ సంతకంతో బాగా పరిచయమున్నట్టే గుర్తు. తినబోతూ రుచి అడగడమెందుకని మళ్లీ కొనసాగించాను "...ఆటలాడుకుంటూ, కథలు చెప్పుకుంటూ మనం గడిపిన రోజులు నీకు జ్ఞాపకం లేదా? కాలువలో మునిగి ఈదులాడుతూ అవతలి గట్టుకు వెళ్ళి దుస్తులారే దాకా బనీన్లనే గోచీగా పెట్టుకునే వాళ్లం గుర్తుందా? నాగన్నగారి తోటలో దొరగిల్లిన జామకాయలు! అవి కండ చక్కెరకన్నా తియ్యగా వుండేవి గదూ!..." అమ్మయ్య, తెలిసిపోయింది. వీడెవడో కాదు. చిన్ననాటి చెలికాడు సోమసుందరం. హైస్కూలు చదువు పూర్తయ్యేదాకా మేము ఎడబాయని జంటగా మసలుకున్నవాళ్లం. ఇంటరులో చేరవలసి వుండగా వాడి తల్లి ఉన్నట్టుండి కళ్లు మూసింది. అంతటితో వారికి స్వగ్రామంతో వున్న లంకె తెగిపోయింది. బెంగుళూరులో మేనమామ యింట వుండి ఇంటరు, ఆ తర్వాత బి.ఇ. పూర్తిచేశాడు. ఆ మేనమామ కూతురినే పెళ్ళి చేసుకున్నాడు. ధార్వారు జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలోని పెద్ద ఫ్యాక్టరీలో చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. ఉద్యోగరీత్యా వాడితో పోల్చుకుంటే నేను ఎదగగలిగింది చాలా తక్కువ. ఆర్ట్సు కాలేజిలో డిగ్రీ పుచ్చుకుని, బి.ఇడి. ముగించి మునిసిపాలిటీ బడిలో మాస్టారుగిరీ సంపాదించేసరికి నాకు తల ప్రాణం తోకకొచ్చింది. పెళ్లయ్యేదాకా వీలయినప్పుడల్లా ఈ ప్రాంతాలకు వచ్చి కొద్ది రోజులు గడిపిపోతుండేవాడు సోమసుందరం. పెళ్లయ్యాక కొంత కాలం పాటు ఆరు నెలలకో, సంవత్సరానికో ఓ ఉత్తరం ముక్కయినా రాసిపడేస్తూ వుండేవాడు. గడచిన అయిదారేళ్లుగా మామధ్య ఉత్తరప్రత్యుత్తరాలు సైతం లేవు. ఇప్పుడిలా వున్నట్టుండి వాడి దగ్గరి నుంచి ఓ జాబు వూడిపడిందంటే చెప్పుకోదగ్గ విశేషం వుండేవుండాలి, నా ఊహ నిజమే. "...కొద్ది రోజులపాటు మనం కలిసి వుండే అవకాశం ఒకటి ఏర్పడిందిరా ఉమాపతీ! మదరాసులో ఓ కంపెనీవాళ్లు జపాను నుంచి ఓ కొత్త యంత్రాన్ని దిగుమతి చేసుకున్నారు. దాన్ని 'ప్రోసెస్'లో పెట్టే విషయంలో వాళ్లకు మా ఫ్యాక్టరీవాళ్ల సహకారం కావలసి వచ్చింది. వారం రోజుల డెప్యుటేషనుపైన నేను బెంగుళూరు నుంచీ బయల్దేరి బృందావన్ ఎక్స్‌ప్రెస్‌లో మదరాసు వెళ్తున్నాను..." (ఇక్కడ వెళ్ళే తారీఖు, టైము వగైరాలు పేర్కొన్నాడు సోమసుందరం.) "నువ్వు ఆర్కోణం జంక్షనులో తప్పక నన్ను కలుసుకోవలసింది. సెలవుపెట్టి రావాలని నీకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

## సాహితీ దీపావళి!



కాకరపువ్వొత్తులను
కవి కిశోరాల కివ్వండి,
కలల జలతారులద్ది
కమనీయ రంగులలో,
వెలుగును తెనిగిస్తారు!

* * *

చిచ్చుబుడ్లను మాత్రం
వర్ధమానుల కివ్వండి,
అవి మరింత పైపైకి ఎగిరే నిమిత్తం,
ఆశల ఊపిరిని పోస్తారు!

* * *

ఆటంబాంబులు సరేసరి
అవి విరసం వారి సొత్తు!

* * *

అరసం వారికి విష్ణు చక్రాల నివ్వండి
ఉన్నచోటనే వుండేలా
అందంగా గుమ్మడంగా తిప్పుతారు!

* * *

తారాజువ్వలు తదితరుల కివ్వండి,
ఆకాసం ఆరేసిన జరీ చీరనుకుని
అదే పనిగా వదుల్తారు!

* * *

అగ్గిపెట్టెలున్నాయిగా
అవి రచయిత్రుల కివ్వండి
అలవాటయినవి కాబట్టి
అలవోకగా కాలుస్తారు! ●

(చాటువు కాదిది చమత్కార కవిత)
– పులిచేరి రామమోహనరావు

ఆర్కోణం స్టేషనులో మదరాసు టికెట్టు కొనుక్కోడమూ మరచిపోవద్దు. నాకు మదరాసులో వుంటే గింటే రెండు మూడు రోజుల పని మాత్రమే వుంటుంది. మిగిలిన నాలుగు రోజులూ విశ్రాంతే, కంచి, పక్షితీర్థం, మహాబలిపురం, మెరీనా, అడయారు ఆ ప్రదేశాలన్నీ ఎంచక్కా చక్కర్లు కొట్టి రావచ్చు. కబుర్లు చెప్పుకోవచ్చు. నన్ను డిసపాయింట్ చెయ్యవుగదూ..."

అనుదిన జీవిత రొటీన్ కార్యక్రమాల నడుమ మనిషిగా మాత్రం రిలీఫ్ అవసరమే. పైగా బాల్య మిత్రుడి అభ్యర్థన, ఊళ్లు చూడాలన్న ప్రలోభం నాకున్నూ లేకపోలేదు. తీర్థమూ, స్వార్థమూ గూడా కలిసివచ్చే పనైపోయింది గదా! ఆ రోజు కోసం నిరీక్షిస్తూ కూచున్నాను. ఆ శుభ సమయం గూడా రానే వచ్చింది.

తిరుపతిలో ప్రయాణీకుల రద్దీ మహా చిత్రంగా వుంటుంది. శని, ఆదివారాల్లోనైతే బస్ స్టేషను యాత్రికులతో కిటకిటలాడిపోతుంది. దారి చేసుకుంటూ నడవడానికైనా వీలుండదు. బ్రహ్మోత్సవాలు జరుగుతున్నా, సంవత్సరాది దగ్గరికి వచ్చినా, మరే విశేష దినాలలోనైనా జనస్తోమం నేల ఈనినట్టే తయారైపోతుంది. అప్పటికీ రెండు నిమిషాలకో బస్సు చొప్పున యిటు ఓవర్ బ్రిడ్జి దిగిగానీ, అటు కొర్లగుంట వైపునుంచిగానీ వచ్చి బస్ స్టేషనులో దిగబడిపోతుంటాయి. వీలయినంత మందిని ఎక్కించుకుని సాగిపోతూనే వుంటాయి. అయినా రద్దీ మాత్రం తగ్గదు.

అంతకు ముందటి దినం తిరుమల దేవుడి హజారంలో పెద్ద పండుగ ఏదో జరిగి వుండాలి. నేను ఆర్కోణం వెళ్లవలసిన రోజున తిరుపతి బస్ స్టాండులో జనం కుంభమేళ తిరణాలలా మూగిపోయి వున్నారు. ఎట్లాగో వీలు చేసుకుని ఈ చివరి నుంచి ఆ చివరకు రెండు మూడుసార్లు తిరిగి చూచాను. బస్సులపైన నాక్కావలసిన ఊరిపేరు తప్పితే మిగిలిన ఊళ్ల పేర్లన్నీ కానవస్తున్నాయి. దేశంలో ఏ మూలనుంచైనా తిరుపతికి యాత్రీకులు వస్తుంటారు. ఆర్కోణం ప్రాంతాల నుంచీ రావడానికి గూడా బస్సుండాలి గదా! ఏదీ, ఎక్కడుందది?

ఎంక్వయిరీలో కూర్చున్న ఉద్యోగి బస్సుల రాకపోకల వివరాలు చెప్పి చెప్పీ డస్సిపోయినట్టున్నాడు. ఒకటి రెండుసార్లు నా స్వంత గొడవ చెప్పుకున్న మీదట అతడు టేబిలు పైన్నుంచీ తల మాత్రం పైకెత్తి "ఆర్కోణమా?" అంటూ కలవరించాడు. ఆపైన కాస్త తెప్పరిల్లుకుని "మీరొక పని చేయండి సార్! మొదట తిరుత్తణికి వెళ్లిపోండి, అక్కడి నుంచి అరగంట కొకటి లెక్కన ఆర్కోణానికి తిరువళ్లువర్ ట్రాన్స్‌పోర్టు బస్సులుంటాయి" అన్నాడు.

"తిరుత్తణి బస్సు ఎక్కడుంటుంది?" అని అడిగాను.

"ఇక్కడగాదు. పాత బస్టాండులో"

రైల్వే స్టేషనుకు చేరువగా వున్న పాత బస్టాండు దిష్టితీసి విసరిపారేసిన మట్టి పిడతలా వుంటుంది. పది పదిహేనింటికన్నా ఎక్కువ బస్సులు అక్కడ నిలవలేవు. రాష్ట్ర ఆర్.టి.సి.వారు వదిలిపెట్టిన కొన్ని పొరుగు రాష్ట్రాల లింకు రూట్లను కైవశం చేసుకుని, వాటిపైన కొన్ని ప్రయివేటు కంపెనీల వాళ్లు తమ బస్సులు నడిపిస్తూ వుంటారు. అక్కడ పద్ధతులకు, నియమాలకు తావులేదు. అంతా ఇష్టా రాజ్యం. బస్తాలో దూదిని కూరినట్టు బస్సుల్లో ప్రయాణీకులను ఎక్కించడం కోసం బ్రోకర్లు


కొందరు ఊళ్ల పేర్లు చెబుతూ గొంతు చించు కుంటూ వుంటారు. చెత్తాచెదారం, కుక్కలు, బిచ్చగాళ్లు మొదలైన నేపథ్యంలో అది చిన్నసైజు నరకంలా వుంటుంది. ఏ మాత్రం వాన వచ్చినా సైడు కాలువలు పొంగి మురికి నీళ్లన్నీ మిట్టపళ్లాల బస్‌స్టాండులోకి ప్రవహిస్తాయి. అప్పుడది నరకం గాదు. వైతరణి.

అలాంటి పాత బస్‌స్టాండులో నేను ప్రయాణం చెయ్యవలసి వచ్చిన రోజున అక్కడ నిలిచిన బస్సు లన్నింటినీ అవలీలగా ఎత్తుకెళ్ళిపోగలిగినంత మంది ప్రయాణీకులు ప్రోగైపోయి వున్నారు. బుట్టలు, పెట్టెలు, పిల్లలు, పాపలు, అరుపులు, ఏడుపులు మొదలైన వాటితో బస్‌స్టాండు నానా ఖంగాళీగా వుంది. ఎవడి ధ్యాసే వాడిదిగానీ, ఇంకొకరిని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. 'తిరుత్తణి బస్సా? వెళ్ళిపోయిందే' అని ఒకరు, 'రావాలి. ఎప్పు డొస్తుందో తెలియదు' అని ఒకరు. 'సాయంకాలం 'సప్తగిరి' వుందిగా! అందులో వెళ్తే పోలా' అని ఒకరు యిలా ఎవరికి తోచిన మాట వాళ్లు చెప్పి నాలో మిగిలి వున్న మతిని కాస్తా పోగొట్టారు. సాయం కాలం ఆరున్నరకల్లా నేను అర్కోణం రైల్వే స్టేషన్లో వుండాలన్న విషయం వాళ్లకేం తెలుసు? పైగా దారిలో బస్సు మారాల్సి వుందిగూడా! అందువల్ల మరికొంత విలంబనం జరిగినా జరగొచ్చు. ఇంతకూ ఇతరుల్ని తప్పుపట్టడం ఏం లాభం? అప్పటికేదో సొంత కారున్నట్టు మధ్యాహ్న భోజనం కానిచ్చి, నింపాదిగా బయల్దేరినందుకు నాపైన నాకే కోపం పుట్టుకొచ్చింది.

ప్రయాణీకుల తలలపైన్నుంచీ బస్సుల కదలి కలు కనిపెడుతూ కాలుగాలిన పిల్లిలా బస్‌స్టాండు చుట్టూ తిరగసాగాను. గంట రెండు కాబోతుండగా 'తిరుత్తణి, తిరుత్తణి' అన్న గగ్గోలు చెలరేగడంతో, నేనెక్కవలసిన బస్సు వచ్చేసిందని నేను నా శ్రవ ణేంద్రియాల ద్వారా గ్రహించడం మాత్రమే సాధ్య మైంది. శబ్దవేది బాణంలా ఆ సవ్వడి వినవచ్చిన దిశకు దూసుకుపోయాను. 'తిరుత్తణి టు తిరుపతి' బస్సు బురద నీటిలో జొరబడుతున్న బాతులా ముందుకూ వెనక్కూ ఊగిసలాడి, సంకు చిత పరిధిలోనే ఒక చుట్టు తిరిగి, తిరిగి వెళ్లడానికి వీలుగా గేటుకు అభిముఖంగా నిల్చుండిపోయింది. బస్సు గుమ్మానికప్పుడు నేను రెండు బారల దూరంలో నిలబడి వున్నాను. మధ్య జాగాలో దాదాపు రెండు వందల మంది ప్యాసెంజర్లు ప్రాణా లను ఫణంగా పెట్టి అయినాసరే బస్సులో దూర డానికి ఉద్యుక్తులైవున్నారు. వాళ్లు దిగేవాళ్లని దిగ నివ్వడం లేదు. దిగేవాళ్ల పాదాలను నితక్ర తొక్కేస్తూ వాళ్లనలాగే లోపలికి నెట్టి ఖడ్గమృగాల్లా లోపలికి చొచ్చుకపోతున్నారు. ద్వారంలో మరీ 'కుయ్యో, మొర్రో' అంటూ ఆక్రందనలు విని పిస్తున్నాయి. 'బలం వుంటేనే బ్రతుకు' అన్న ఈ ప్రదర్శనను చూస్తూ నిల్చునే ఓపికలేక సగంమంది ప్రయాణీకులు కిటికీ అంచుల్ని అందిపుచ్చుకుని, తలల్ని లోపలికి దూర్చి బొరియల్లోకి దూరిపోయే పందికొక్కుల్లా తమ కాయాలను బస్సులోకి చేర వేసుకుంటున్నారు. లగేజ్‌తోబాటు బిడ్డలు గూడా కిటికీలలోనుంచే లోపలికీడ్చుకోబడ్డారు. బస్సులో దిగి సీట్లు పడేసిన మగవాళ్లు అప్పుడిక అసహాయ శూరులై విజృంభించి తమతమ ఆడవాళ్లను సైతం కిటికీలగుండా లోపలికి చేరుకోడంలో కృతకృత్యులై పోయారు. యుద్ధ వ్యూహంలో నుంచీ బయట పడిన క్షతగాత్రుల్లా బస్సులో నుంచి దిగబడిన వాళ్లు జనాన్ని తొలగదోసుకుని ఉచ్చులు తెంచుకున్నట్టుగా పారిపోతున్నారు. ట్రిక్ ఫొటోగ్రఫ్ ద్వారా జరిగిన ఇంద్రజాలంలో నేలపైన వున్న జనం రెండు నిమిషాల వ్యవధిలో బస్సులోకి వెళ్ళిపోయి ఫుట్ బోర్డులో చివరి మెట్టుదాకా ఆక్రమించేసుకున్నారు. ముందువైపు నిల్చున్నవాళ్లు ఎంతో కొంత సర్దు బాటు చేస్తేగానీ అదనంగా ఒక ప్రయాణీకుడు ఫుట్ బోర్డుపైన ఒంటికాలితో నిలబడడమైనా



జి. యన్. ఆర్. కాలేజి
4/2, 4/12, 4/14, బ్రాడీపేట, గుంటూరు-2, PHONES: 32361, 33820

* మెడికల్ & ఇంజనీరింగ్ & లాంగ్ టర్మ్ & షార్ట్ టర్మ్
* A.P.R.J.C & పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్
* అన్ని కోర్సులకు ఇంగ్లీషు & తెలుగు మీడియంలలో శిక్షణ
* బాలురకు, బాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి గలదు


M. గోపాలరావు T. కమలాకర్ V. ప్రసాద్ K. కృష్ణారావు

మెడికల్

P. సూర్యనారాయణ
1984 స్టేట్ 3వ ర్యాంక్
గుంటూరు మెడికల్ కాలేజి

ఇంజనీరింగ్

G. నిర్మలాకుమారి M. విజయకృష్ణ B. జయప్రద M. ప్రసాద్

P. సూర్యనారాయణ (3)
K. కనకదుర్గ (5)
S. జయరాం
Ch. రామకృష్ణ
P. రాధిక
Ch.S. నాగేశ్వరరావు
కుసుమ రాధ కృష్ణమూర్తి
G. రామాంజనేయులు
ఝాన్సీ
G.V.S. నాగేశ్వరరావు

P. ఎలిషా
K. శ్రీనివాస్
M.C.H. నాయక్
E. నాగిరెడ్డి
D.V. రమణకుమార్
A. స్వామి రంగయ్య
K. ఏలియ
M.G.V.N. ప్రసాద్
Y.V.S. బాబురావు
L. కల్యాణ చక్రవర్తి
S. బాన్సి లక్ష్మి

P. రాజకుమార్
K. నాగేశ్వరరావు
M. శ్రీకృష్ణ
K.N. శ్రీనివాస్
P. రత్నబాబు
శ్రీహరిరావు
Y. శాంతి
V. రామచంద్రారెడ్డి
A. హనుమంతరావు
C. శూలపాణి
P. అనిల్‌బాబు

T. కమలాకర్
G. జవహర్
M. మదనకుమార్
K. ఆనందసాగర్
B. జయప్రద
G. నిర్మలా కుమారి
K.T. ప్రకాష్

EAMCET

| | |
|---|---|
| క్రాంతికుమార్ | ర్యాంక్ 40 |
| P. శ్రీధర్ | 52 |
| ఉషశ్రీ | 72 |
| D. మధురాణి | 122 |
| K. అంకమ్మరావు | 217 |
| K. శైలజ | 262 |


| | | | | | |
|---|---|---|---|---|---|
| B. సాంబశివరావు | 304 | M. గోపాలరావు | 83 | V.S.V. ప్రసాద్ | 582 |
| K. కృష్ణారావు | 383 | Y.S.R. ఆంజనేయులు | 301 | V. కోటేశ్వరి | — |
| M. మధుశ్రీ | 466 | J.V. కృష్ణమూర్తి | 406 | T.A. మధుబిందు | 492 |
| ఆంజనేయులు | 701 | J. శ్రీనివాసరావు | 489 | వేణుగోపాలరెడ్డి | 618 |
| A. విజయలక్ష్మి | 77 | G. ఇన్నారెడ్డి | 522 | | |

సెక్రటరీ & కరస్పాండెంట్
K. వెంకటేశ్వరరావు
M.Sc. SPECTROSCOPY
M.Sc. న్యూక్లియర్ ఫిజిక్స్
ఎ.సి. కాలేజి పూర్వ ఫిజిక్స్ లెక్చరర్

ప్రిన్సిపాల్
శ్రీమతి G.V. రత్నం M.A.

డైరెక్టర్
గుంటుపల్లి నరసింహారావు, M.Sc. DJ

శాతవాహన రెసిడెన్షియల్ కాలేజి
ఇంటర్ M.P.C., Bi.P.C., C.E.C. మరియు పదవ తరగతి రెగ్యులర్ క్లాసులకు గూడ
ఎంట్రన్స్ ఫౌండేషన్‌తో ప్రారంభము నుండి శిక్షణ గలదు




సాధ్యంగాదు.

"బాబ్బాబూ! తొందర పనిమీద అర్జెంటుగా వెళ్లాలి. కాస్త సర్దుకోరూ" అంటూ బ్రతిమాలుకున్నాను.

"టాపుపైన కూచోరాదూ!"- ఒకాయన ఉచిత సలహా యిచ్చారు.

ఎట్లాగైనా బుద్ధి జీవినిగదా! నా బుద్ధి కాస్త చురుగ్గా పనిచేసింది. కండక్టరు బస్సులో లేడు. డ్రయివరుతో కలిసి టీ సేవించడం కోసం వెళ్ళినట్టున్నాడు. అతడు తిరిగి వచ్చినప్పుడైనా ఈ ఫుట్‌బోర్డు ప్రయాణీకులు కొంచెం వొత్తిగిల్లి దారి యివ్వాలి గదా! ఆ వ్యవధిలో సందు చూసుకుని ఫుట్‌బోర్డు కంటుకుపోవాలి. అంతకుమించి గత్యంతరం లేదు.

అయిదు నిమిషాలు గడిచేలోగా డ్రయివరు కండక్టర్లిద్దరూ 'పోదామా' అంటే 'పోదాం' అని కూడపలుక్కుంటూ ఏ మూలనుంచో ఊడిపడ్డారు. బస్సులోని ప్రయాణీకులు ఊపిరాడకుండా విలవిలలాడిపోతున్నారన్న విషయం వాళ్లకేమీ బాధాకరంగా లేదు. అందుకు బదులుగా తమ వాహనం పుష్పక విమానాన్ని తలపిస్తున్నందుకు సంబరపడిపోతున్న వైఖరే వాళ్ల ముఖాల్లో తాండవించింది. "మొదట డోర్ వేసుకో" అని హెచ్చరించి డ్రయివరు బస్సు ముందువైపు నుంచీ అటు ప్రక్కకు వెళ్లిపోయాడు. "సర్దుకుంటే సర్దుకోండి, లేకుంటే క్రిందికి దిగండి" అని కండక్టరు సింహగర్జన చేయడంతో గుమ్మంలోని ప్రయాణీకులు పునుగుపిల్లుల్లా ఒళ్లు ముడుచుకుని లోవైపుగా ఒదిగిపోయారు. కండక్టరు విజయగర్వంతో ఫుట్‌బోర్డు పైకెక్కి "రైట్, రైట్" అన్నాడు. వెనువెంటనే నేనుగూడా ఫుట్‌బోర్డుపైన కాలు మోపాను.

బస్సు మెల్లగా కదిలి సాగబారింది. దేవస్థానం వారి ధర్మసత్రం దాకా అట్లాగే మందగమనం చేసింది. ఈలోపల డ్రయివరు 'డోరు, డోరు' అంటూ రెండుసార్లు బిగ్గరగా అరిచాడు. తలుపుపైన చేయివేస్తూ కండక్టరు నావైపు తిరిగి చూచాడు. "సార్, మీరొకరుండిపోయారా బయట?" వినయం పుట్టి పడుతుండగా అడిగాడు. ఫుట్‌బోర్డుపైన నా ఉనికికి అతడు సమ్మతిస్తున్నాడనే నేననుకున్నాను. "కొంచెం దిగండి సార్! మళ్లీ ఎక్కించుకుంటాను" ఈసారి మరీ ప్రాధేయపడుతున్నట్టుగా అన్నాడు. అతడి సౌమనస్యానికి సంతోషిస్తూ నేను క్రిందికి దిగాను. నేను దిగిన మరుక్షణంలోనే తలుపు టపీమని మూసుకుంది. కండక్టరు పెద్ద గొంతుకతో 'రైట్, రైట్' అన్నాడు. బస్సు వేగం పుంజుకుంది. బస్సు బాడీని దబదబా మోదేస్తూ నేను పరుగులంకించుకున్నాను. కానీ పరుగుపందెంలో బస్సే గెలిచింది. నేను దిగాలుపడిపోయి బాలాజీ భవన్ ఎదుట రోడ్డుపైన నిల్చుండిపోయాను.

ఇంటికి తిరిగి వెళ్లడమా, యింకొక బస్సు కోసం వేచి వుండడమా? ఎటూ పాలుపోయింది గాదు. మళ్లీ పాత బస్‌స్టాండువైపు వెళ్లడానికి మాత్రం మనస్కరించలేదు. అక్కడొక హోటల్లో కాఫీ త్రాగి, కాళ్లీడ్చుకుంటూ ఆర్.టి.సి. బస్ స్టేషనువైపే నడవసాగాను. బస్సు దిగిన ప్రయాణీకుణ్ణిగా భావించి కొందరు రిక్షావాళ్లు "ఎక్కండి సార్, ఎక్కండి సార్' అంటూ నన్ను వెంటాడుతున్నారు. ఇంటి అడ్రసు చెప్పి రిక్షా ఎక్కబోతుండగా వెనుకవైపు నుంచీ బస్ హారన్ వినిపించింది. తిరిగి చూద్దునుగదా, నా కళ్లను నేనే నమ్మడానికి వీల్లేని పరిస్థితి! అందాకా ఎక్కడ పొంచివుండిపోయిందోగానీ, మరొక తిరుత్తణి బస్సు సావకాశంగా పురవీథివెంట బయల్దేరి వస్తోంది. ఇంకా నయం! ఇందులో నిల్చోడానికైనా తావుంది. చెయ్యి అడ్డంసాచి బస్సెక్కేశాను. టికెట్టు కొనుక్కునేలోగా ఎవరో యిద్దరు కుర్రాళ్లు కల్పించుకుని తమ సీటులో నాకు కాస్త జాగా చూపించారు. మధ్యాహ్నం నుంచీ ఎదురైన వేసటవల్ల బాగా అలసిపోయానేమో, బస్సు రేణిగుంట చేరుకునేలోగా నాకు కాస్త కునుకుగూడా పట్టింది.

అలా ఎంతసేపు గడచిందో తెలియదు. హఠాత్తుగా ఉలికిపడి మేలుకున్నాను. బస్సు ఘాటురోడ్డు మలుపులో ఆగిపోయి వుంది. జరగరాని సంఘటన ఏదో జరిగిపోయినట్టు, చూడరాని సన్నివేశాన్ని దేన్నో చూసినట్టు ప్రయాణీకుల ముఖాలు వెలవెలపోయి వున్నాయి. రోడ్డుపైకి దిగినవాళ్లు కొందరు కనుగ్రుడ్లు నిండుకు క్రమ్ముకున్న కన్నీటిని తుడుచుకుంటూ ఆదరాబాదరా బస్సులోకి వచ్చేస్తున్నారు. కంగారుపడిపోతూ "ఏమిటి, ఏమిటి" అని అడిగాను. ప్రక్కన కూర్చున్న కుర్రాడు "చూడండి సార్, అటు చూడండి" అన్నాడు. గబగబా బస్సుదిగి ముందుకు అడుగు వేయబోతూ ఆగిపోయాను. పిట్టగోడ నాలుగైదు బారల మేరకు విరిగి అయిపు లేకుండాపోయింది. ఢీకొన్న బస్సూ, లారీలు వికృతంగా రూపాంతరం చెంది ఏడెనిమిది నిలువుల లోతున ఎండిపోయిన వాగులో అడ్డదిడ్డంగా పడివున్నాయి. లారీలోని బస్తాలు, నుగ్గునూచమైన గాజుపలకల శకలాలు కొండచరియ అంతటా చెల్లాచెదురుగా పడివున్నాయి. అవయవాలు ఊడిపోయి, విరిగిపోయి, తెగిపోయి రక్తసిక్తంగా మారిపోయిన మానవ కళేబరాలు చెట్లు, పొదలు, పుట్టలు ఆలంబనంగా వివిధ వికృత భంగిమల్లో వ్రేలాడుతున్నాయి. ఇంకా యింకిపోని, ఆరిపోని పచ్చినెత్తురు నేలపైన, బండలపైన అట్టలు గట్టుకపోతూ వుంది. చాలు బాబూ చాలు! ఒకసారి చూస్తే మళ్లీ జీవితాంతం వెంటాడే దృశ్యం అది. సుడిగాలిలా తిరిగివచ్చి బస్సులో పడిపోయి, కళ్లు గట్టిగా మూసుకున్నాను.

** ** **

"అనంతమూర్తీ! అదిరా బాబూ సంగతి! పాత బస్‌స్టాండులో నన్ను దిగవిడిచిపోయిన బస్సే అది! నేనింకా జీవించి వున్నానంటే అందుకు కారణమేమిటో నువ్విప్పుడు ఊహించగలవనుకుంటాను" అంటూ ఆగాను.

అనంతమూర్తి తల పంకిస్తూ "మరైతే నేను జీవించి వుండడానికి కారణమేమిటో చెప్పలేదే!" అన్నాడు.

"నువ్వూ నేనూ, వాడూ వీడూ, ఆమె ఈమె వెరశీ మనమందరమూ యింకా సజీవులమై వున్నామంటే అందుకు కారణం యిదే! మనం రోడ్డు ప్రక్కన పల్టీ కొడుతున్న బస్సుల్లో లేము. వంతెనపైన్నుంచీ క్రిందికి దూకేసే రైళ్లలో లేము. బాంబులవల్ల కూలిపోయే విమానాల్లో లేము. విద్రోహ చర్యలవల్ల పతనమయ్యే భవనాల్లో లేము. మందు పాతరలవల్ల ప్రేలిపోయే జీపుల్లో లేము. నాయనా అనంతమూర్తీ! ఇదే నేను నీకు చెప్పదలచుకున్న 'జీవన రహస్యం'. ఇది కఠోపనిషత్తు గాదు. కఠోరోపనిషత్తు."

ఎట్ట ఎదుట టేబిలు పైన వున్న గ్లాసులో కాఫీ చల్లారిపోతోంది. అనంతమూర్తి విప్పుకున్న మిడిగ్రుడ్లతో పైకప్పుకేసి చూస్తున్నాడు. అతడిలో చలనం లేదు.